సాక్షి
ఏలూరు
మంగళవారం । 26 । ఆగస్టు । 2025



పైసలిస్తేనే ఆపరేషన్లు
తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో కు.ని. ఆపరేషన్లు చేయించుకోవాలంటే సిబ్బంది చేయి తడపాల్సిందేనని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.
8లో



టీడీపీ నేతల అడ్డాగా ఫెర్రీ
అబ్బిరాజుపాలెంలో గోదావరిలో పడవ ప్రయాణానికి అనుమతి లేకపోయినా టీడీపీ నాయకులు దౌర్జన్యంగా పడవలు నడుపుతున్నారు.
8లో



కూటమిలో డిష్యూం.. డిష్యూం
అజ్జమూరులో జనార్దనస్వామి దేవస్థానం నూతన కమిటీ విషయంలో కూటమి నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.
8లో

మారని పోలీసుల తీరు

- పదేపదే అక్రమ కేసుల నమోదు
- సరికొత్త వేధింపులకు తెర తీసిన వైనం
- పెదవేగి ఎస్సైకు గతంలో మెమో జారీ చేసిన న్యాయమూర్తి
- మళ్లీ రెండోసారి మెమో జారీ
- న్యాయస్థానాలు మందలిస్తున్నా మారని నైజం
- చాటపర్రు సర్పంచ్ కుటుంబ సభ్యులపైనా కేసులు

సాక్షి ప్రతినిధి,ఏలూరు: తప్పుడు కేసులు.. అక్రమ అరెస్టులు.. అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి ఇష్టానుసారంగా కేసుల పేరుతో వేధింపులు.. మరీ కోపం తారాస్థాయికి చేరితే థర్డ్ డిగ్రీ పేరుతో పోలీస్ ట్రీట్‌మెంట్.. ఇది ప్రస్తుతం ఏలూరు జిల్లాలో సాగుతున్న పోలీసింగ్. అక్రమ అరెస్టులపై న్యాయస్థానాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా పోలీసుల తీరు మారకపోవడం చర్చనీయాంశంగా మారింది. గతంలో ఇదే తరహాలో ఒక కేసు విషయంలో పెదవేగి ఎస్సైపై న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేసి మెమో జారీ చేశారు. మళ్లీ అదే ఎస్సైకి అలాంటి కేసు విషయంలోనే మెమో జారీ చేయడంతో పాటు చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా ఎస్పీని ఆదేశించడం పోలీస్ శాఖలో హాట్‌టాఫిక్‌గా మారింది.

విమర్శలకు తావిస్తూ..

దెందులూరు నియోజకవర్గంలో పోలీసుల తీరు విమర్శలకు తావిస్తుంది. అధికార పార్టీకి పూర్తిగా దాసోహమై అడ్డగోలు కేసులు, సంబంధం లేని వ్యక్తులను స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్‌లు ఇవ్వడం, అక్రమ అరెస్టులకు కేంద్రంగా మారింది. వ్యక్తిగత వివాదాలు పార్టీ రంగు పూసి వేధించడం, సివిల్ వ్యవహారాల్లోనూ అధికార పార్టీ నేతల ఆదేశాలతో తలొగ్గి పనిచేయడం తరచూ వివాదాస్పదమవుతోంది. చేపల చెరువుల్లో చేపలు పట్టుకోవడానికి రక్షణ కల్పించమని హైకోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకుని మరీ చేపలు పట్టే పరిస్థితులు కొన్నిచోట్ల ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కొన్ని సందర్భాల్లో హైకోర్టు ఉత్తర్వులు ఉన్నా ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి.

తాజాగా మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి నివాసం వద్ద టీడీపీ, వైఎస్సార్‌సీపీ శ్రేణుల మధ్య కొనసాగిన ఉద్రిక్తత వాతావరణంలో 15 మందిపై కేసులు నమోదు చేశారు. జిల్లాపరిషత్ వైస్ చైర్మన్‌తో పాటు ముఖ్యనేతలు, మరికొందరు నాయకులు వీరిలో ఉన్నారు. వీరిలో ఏలూరు రూరల్ మండలం చాటపర్రు సర్పంచ్ గుడిపూడి రఘు ఏ15గా ఉన్నారు. శనివారం ఉదయం ఏలూరు రూరల్ పోలీసులు హడావుడిగా ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. సాయంత్రానికి పెదపాడు పోలీస్‌స్టేషన్‌కు మార్చారు. ఆదివారం న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా అక్రమ అరెస్టుపై ఆగ్రహం వ్యక్తం చేసి ఎస్సై రామకృష్ణకు మెమో జారీ చేశారు. అలాగే చర్యలు తీసుకోవాల్సిందిగా ఎస్పీని ఆదేశించారు. కట్‌చేస్తే.. రఘును శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్న సమయంలో మధ్యాహ్నం కుటుంబ సభ్యులు, కొందరు పార్టీ నాయకులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని రఘును చూడటానికి పోలీసులతో మాట్లాడానికి ప్రయత్నించగా నిరాకరించారు. పోలీసుల తీరుపై కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న కుటుంబసభ్యులు, వైఎస్సార్‌సీపీ నేతలపై సోమవారం ఏలూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సర్పంచ్ రఘు తల్లి మార్తమ్మ, భార్య జ్యోతి, సోదరుడు రాజేష్‌తో పాటు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు అప్పనప్రసాద్, ముంగర సంజీవ్‌కుమార్, బత్తుల ఏసురాజులపై పోలీసులు కేసు నమోదు చేశారు.



నా కోసం మా కుటుంబం రాకూడదా?



పోలీసులు ఒక కుటుంబంలో ఒక వ్యక్తిని అరెస్టు చేస్తే అతని తల్లి, తమ్ముడు, భార్య రాకూడదా..? కుటుంబ సభ్యులకు కాకుండా ఇంక ఎవరికి బాధ్యత ఉంటుంది. ఎవరు రావాలి.. ఎవరు రాకూడదనే విషయంపై ఏమైనా నిబంధనలు ఉన్నాయా. తాను బాధ్యత గల సర్పంచ్‌గా ఉన్నాను. నా తరఫున క్షేమం కోరి కుటుంబసభ్యులు, ప్రజాప్రతినిధులు, స్నేహితులు వస్తారు ఇదెలా తప్పు అవుతుంది.

– గుడిపూడి రఘు, చాటపర్రు సర్పంచ్

సెల్ టవర్ ఎక్కి హల్‌చల్



కొయ్యలగూడెంలో టవర్ ఎక్కిన యువకుడు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలో సెల్ టవర్ **ఎక్కి ఓ యువకుడు హ**ల్‌చల్ చేశాడు. టి.అయ్యప్ప అనే యువకుడు అశోక్‌నగర్‌లో నివసిస్తున్నాడు. సోమవారం వేకువజామున కొవ్వూరు రోడ్డులోని బీఎస్‌ఎన్‌ఎల్ టవర్‌పైకి ఎక్కి గ్రామ పెద్దలకు ఫోన్ చేసి గ్రామ సమస్యలు పరిష్కరించకపోవడంతో తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నానంటూ మెసేజ్‌లు పెట్టడంతో పాటు ఫోన్‌లు కూడా చేశాడు. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు, పోలవరం ఇన్‌స్పెక్టర్ బాల సురేష్‌బాబు, కొయ్యలగూడెం ఎస్సై చంద్రశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించిన అయ్యప్పకు నచ్చజెప్పి కిందకు దించారు. తర్వాత అతడికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు. గ్రామంలో పలు సమస్యలు ఉన్నాయని సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని, ఆలయాల సొమ్ము దుర్వినియోగం అవుతుందని వీటిపై గ్రామ పెద్దలు పట్టించుకోకపోవడంతో మనస్తాపంతో తాను ఆత్మహత్యకు యత్నించినట్టు అయ్యప్ప అధికారులకు వివరించాడు.

న్యూస్‌రీల్

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తి కృష్ణమోహన్‌కు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న ఈఓ మూర్తి

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ సోమవారం సందర్శించారు. సతీసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. న్యాయమూర్తి స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు చేయించారు. పండితులు ఆయనకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి వేద ఆశీర్వచనాన్ని పలకగా, ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు. న్యాయమూర్తి వెంట భీమడోలు కోర్టు జడ్జి ఎస్.ప్రియదర్శిని నూతక్కి, ఏఈఓ పి.నటరాజారావు ఉన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. శ్రీవారికి విశేష ఆదాయం సమకూరింది. 38 రోజులకు నగదు రూపంలో రూ.3,61,54,678లు, 261 గ్రాముల బంగారం, 6.834 కిలోల వెండితో పాటు అధికంగా విదేశీ కరెన్సీ లభించిందని ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణమూర్తి తెలిపారు. అలాగే రద్దయిన పాత రూ.2,000, రూ.1,000, రూ.500 నోట్ల ద్వారా రూ.67 వేలు లభించిందన్నారు.

చెత్త తొలగించారు



చెత్తను తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

సాక్షి స్పందన

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి మూడు రోజులుగా రోడ్లపై పేరుకుపోయిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. పారిశుద్ధ్య కార్మికులకు జులై నెల జీతాలు, ఐదు నెలల నుండి పెంచిన జీతాలు ఇవ్వకపోవడంతో వారు మూడు రోజుల నుంచి విధుల్లో పాల్గొనడం లేదు. దీంతో రోడ్లపై చెత్త పేరుకుపోయింది. దీనిపై ఆదివారం 'సాక్షి'లో 'వీధుల్లో ఎక్కడ చెత్త అక్కడే' శీర్షికన కథనం ప్రచురించగా పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి లక్ష్మి స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులతో రోడ్లపై చెత్తను తొలగించారు. పారిశుద్ధ్య కార్మికుల జీతాల బుధవారం అందిస్తామని, బకాయిలను రెండు నెలల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

28న డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మెగా డీఎస్సీ–2025 అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను ఈనెల 28న ఉదయం ఏలూరు సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నట్టు డీఈఓ ఎం.వెంకట లక్ష్మమ్మ తెలిపారు. అభ్యర్థులు తమ లాగిన్‌కు వచ్చిన కాపీలను డౌన్‌లోడ్ చేసుకుని, సంబంధిత సర్టిఫికెట్లు, డీఎస్సీ హాల్‌టికెట్ కాపీ, ఆధార్ కార్డు, ఐదు పాస్‌పోర్టు ఫొటోలు తీసుకురావాలని సూచించారు. అభ్యర్థులు ముందుగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను ఏపీడీఎస్సీ సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. మరిన్ని వివరాలకు హెల్ప్‌లైన్ 903073444, 905239111 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నిబంధనలు పాటించాలి

ఏలూరు(మెట్రో) : వినాయకచవితి ఉత్సవాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. వినాయకచవితి ఉత్సవాలు, ఎరువులు సరఫరా అంశాలపై కలెక్టరేట్ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్షించారు. బాణాసంచా అనధికార నిల్వలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. జిల్లాలో ఎవరైనా యూరియా ఎరువులు, డీఏపీ అక్రమంగా నిల్వ ఉంచి కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు.

అర్హులెవరికీ పెన్షన్ తొలగించరు

అర్హులైన దివ్యాంగులు ఎవరికీ పింఛన్లు తొలగించరని కలెక్టర్ అన్నారు. తమకు నోటీసులు అందాయని దివ్యాంగులు కలెక్టర్ వద్ద బోరుమనగా విచారణ చేసి అర్హులకు యథాతథంగా పింఛన్లు ఇస్తామన్నారు

పీజీఆర్‌ఎస్‌కు వినతుల వెల్లువ

ఏలూరు(మెట్రో): ఏలూరు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 411 అర్జీలను కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్వీకరించారు. అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులను ఆదేశించారు. జేసీ పి.ధాత్రిరెడ్డి, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఆర్డీఓ యం.అచ్యుత అంబరీష్ తదితరులు పాల్గొన్నారు.



ఏలూరు కలెక్టరేట్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

అర్జీల్లో కొన్ని..

- ఏలూరు మండలం పత్తేబాద వృద్ధాశ్రమం నివాసి గంధం అంజయ్య తన కాలుకు ఆపరేషన్ చేయించుకునేందుకు సహకారం అందించాలని కోరారు.
- మండవల్లి మండలం అల్లినగరం చెందిన జజ్జవరపుపాల్ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు. తనకు కొన్ని నెలలుగా జీతం రావడం లేదని, పరిష్కారం చూపాలని అర్జీ అందించారు.
- చింతలపూడి మండలం యర్రగుంటపల్లి చెందిన కొల్లి నర్సారెడ్డి తమ గ్రామంలోని 9వ వార్డులో డ్రెయిన్లు లేక ఇబ్బంది పడుతున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.
- కైకలూరు మండలం ఆటపాక చెందిన తోట శ్రీనివాస నాయుడు తమ రహదారికి అడ్డంగా కరెంటు స్తంభాలు ఉన్నాయని తొలగించాలని విద్యుత్ శాఖ అధికారులను కోరితే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు.
- కలిదిండి మండలం మూలలంకకు చెందిన ఎస్ఎన్‌వీ సత్యనారాయణ తమ గ్రామంలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని, చర్యలు తీసుకోవాలని అర్జీ అందజేశారు.

దివ్యాంగుల పింఛన్ల తొలగింపు దుర్మార్గం

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విజయరాజు



కామవరపుకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న కంభం విజయరాజు, పార్టీ శ్రేణులు

కామవరపుకోట: ఎలాంటి ఆధారం లేకుండా జీవనం సాగిస్తున్న దివ్యాంగుల పింఛన్లు తొలగించం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పింఛన్ల తొలగింపునకు నిరసనగా మండల కన్వీనర్ రాయంకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో వాహన ర్యాలీ నిర్వహించారు. మండలవ్యాప్తంగా పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్థానిక కొత్తూరు బంగ్లా నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ నిరసన తెలిపి ఏఓ సత్యవేణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్లు తీసివేసి వారి ఉసురు కట్టుకుందన్నారు. కూటమి ప్రభుత్వం దివ్యాంగులను నిలువునా మోసం చేసిందన్నారు. ఇది హేయమైన చర్య అని, ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని విజయరాజు డిమాండ్ చేశారు. వైస్ ఎంపీపీలు తమ్మిశెట్టి గిరిజ, కనికెళ్లి రత్నకుమారి, ఎంపీటీసీలు బొల్లు సత్యనారాయణ, మేడంకి పద్మావతి, కనుమూరి అంజిరెడ్డి, ఉప్పలపాటి సాయిబాబు, మహ్మద్ కరీముల్లా, దేవరపల్లి రామ్మోహన్‌రావు, సాయిన కనక రాజు, గుర్రాల రవికుమార్ నారాయణరాజు, జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు కె.రామకృష్ణ, జిల్లా అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు సాయిల స్వాతి, నియోజకవర్గ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు చొక్క నాగరాజు, రుద్రపాక నాగ మల్లేశ్వరావు, కనుమూరి ప్రసాద్ రెడ్డి, ఘంటా భాస్కారావు, టౌన్ ప్రెసిడెంట్ నానాది సాగర్, అంకాలపాడు, ఉప్పలపాడు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మిగులు భూములు పంచాలంటూ ధర్నా



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గిరిజన ప్రాంత రైతులు

ఏలూరు (టూటౌన్): మిగులు భూములను గిరిజన, దళిత, పేదలకు పంచాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహించారు. భూ సమస్యలు ఎదుర్కొంటున్నటు గిరిజనులు, దళితులు, పేదలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నినాదాలు చేశారు. ధర్నానుద్దేశించి సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బి.బలరాం, జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడారు. జిల్లాలోని అన్నిరకాల భూ సమస్యలు పరిష్కరించాలని, 1/70 చట్టం అమలు చేయాలని, ఎల్‌టీఆర్, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని, అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని అర్హులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని, 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, నిర్వాసిత కాలనీల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, కొల్లేరును 3వ కాంటూరుకు కుదించాలని డిమాండ్ చేశారు. కొల్లేరులో జిరాయితీ భూములు పేదలకు పంచాలని, ప్రభుత్వ భూములను కొల్లేరు ప్రజలకు పంచాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు ఎం.నాగమణి, సభ్యులు డీఎన్‌వీడీ ప్రసాద్, ఆర్.లింగరాజు, పిల్లి రామకృష్ణ, కె.శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు.

దివ్యాంగుల ఉసురు పోసుకుంటున్నారు

ఏలూరు (టూటౌన్): సాఫీగా అందుతున్న పింఛన్లను రీ వెరిఫికేషన్ పేరిట తొలగించి పాలకులు మా ఉసురు పోసుకుంటున్నారని దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దివ్యాంగ పింఛన్ల తొలగింపును నిరసిస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద దివ్యాంగులు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మామిడిపల్లి నాగభూషణం మాట్లాడుతూ పుట్టుకతో వికలాంగులమైన తాము గత 20, 30 ఏళ్ల నుంచి మెడికల్ బోర్డు అథారిటీ మంజూరు చేసినా మెడికల్ సర్టిఫికెట్‌ను కొనసాగిస్తున్నామన్నారు. అయితే తాజాగా సదరం సర్టిఫికెట్ పేరుతో కొత్త విధానాన్ని తీసుకువచ్చి పుట్టుకతో తమ వైకల్య శాతాన్ని తక్కువ చేసి చూపడం అన్యాయమన్నారు. దీంతో తాము పింఛన్లతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు, పథకాలకు దూరమవుతామని ఆవేదన వ్యక్తం చేశారు.



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దివ్యాంగులు

జిల్లావ్యాప్తంగా నాలుగు వేలకుపైగా పింఛన్లు తొలగించడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వానికి పింఛన్ల కోత విధించేందుకు దివ్యాంగులే కనిపించారా అంటూ నిలదీశారు. 2010లో ఇచ్చిన సదరం సర్టిఫికెట్లు ఆధారంగా తమ పింఛన్లు కొనసాగించాలని డిమాండ్ చేశారు. పెద్ద సంఖ్యలో దివ్యాంగులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు చెల్లించాలి

ఏలూరు (టూటౌన్): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.మనోజ్, కె.లెనిన్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు పరిష్కరించలేని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా విద్యార్థులకు ఇచ్చిన హామీలను, విద్యారంగ సమస్యలను పరిష్కరించడం, విద్యాహక్కు చట్టం ఏదీ కూడా పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. జీఓ నెం.77ను తక్షణం రద్దు చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6,400 కోట్లు తక్షణం విడుదల చేయాలని కోరారు. హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు రూ.3,000కు పెంచి మెరుగైన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. చలో కలెక్టరేట్ కార్యక్రమానికి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారన్నారు. ఎస్ఎఫ్ఐ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. పవన్, నగర ఉపాధ్యక్షుడు ఎం. జయంత్, ఎం.శివ, ఎస్.రాజబాబు, ఎస్.సూర్య తదితరులు పాల్గొన్నారు.

'గ్రీన్‌ఫీల్డ్' భూ నిర్వాసితుల నిరసన



నిరసన తెలుపుతున్న కౌలు రైతు సంఘం నాయకులు

ఏలూరు (టూటౌన్): గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని, సర్వీసు రోడ్లను పునరుద్ధరించాలని కోరుతూ బాధిత రైతులు సోమవారం కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం కలెక్టర్ వెట్రిసెల్వికి వినతి పత్రం అందజేశారు. రైతులకు పరిహారం పెంచి ఇవ్వాలని, 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడారు. ఈనెల 4న కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను హైవే అథారిటీ అధికారులు, భూసేకరణ అధికారులు తుంగలోకి తొక్కడం దారుణమన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్డు లేకపోవడం వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సర్వీస్ రోడ్లను తారు రోడ్లుగా నిర్మాణం చేయాలని కోరారు. వచ్చేనెల 2న జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం వద్ద గ్రీన్ ఫీల్డ్ హైవే దిగ్బంధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని చెప్పారు. భూసేకరణలో అతి తక్కువ పరిహారం ఇవ్వడం వలన రైతులు నష్టపోయారని న్యాయం చేయాలని కోరారు. వందనపు సాయిబాబా, గోలి నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతించిన గోదావరి

నరసాపురం : నరసాపురంలో వశిష్ట గోదావరి శాంతించింది. నాలుగు రోజులుగా ఉధృతంగా ప్రవహించగా సోమవారం నీటిమట్టం భారీగా తగ్గింది. అలాగే వలంధర్ రేవు, లలితాంబఘాట్, పడవలరేవు ప్రాంతాల్లో నీటిమట్టం సాధారణ స్థాయికి చేరింది. పడవలరేవులో ఐదు రోజులుగా నిలిచిపోయిన పంటు రాకపోకలు పునరుద్ధరించారు. దీంతో పెద్ద ఎత్తున జనం పంటుపై రాకపోకలు సాగించారు.

క్లుప్తంగా

బౌన్సర్లకు నోటీసులు

నూజివీడు: శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన 8 మంది బౌన్సర్లను అదుపులోకి తీసుకున్నామని నూజివీడు డీఎస్పీ కేవీవీ ఎన్‌వీ ప్రసాద్ సోమవారం తెలిపారు. పెదవేగి మండలం కొండలరావుపాలెంలో ఈ నెల 21న మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఇంటి వద్ద జరిగిన తోపులాట ఘటనకు సంబంధించి వీరిని అదుపులోకి తీసుకున్నట్టు వివరించారు. వారిపై కేసు నిర్ధారణ కావడంతో సెక్షన్ 35(3) కింద నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణం బాట గంగానమ్మ లేఅవుట్ కాలనీలో ఇరువర్గాల మధ్య ఘర్షణ నేపథ్యంలో కేసు నమోదు చేసినట్లు స్టేషన్ రైటర్ పి.బాబూరావు తెలిపారు. లేఅవుట్ కాలనీలో ఫకీర్ నాయుడుపై దాడి చేసి గాయపర్చిన నేరంపై కాకర్ల భవానీ, మరో ఏడుగురిపై కేసు నమోదుచేశామన్నారు. ఫకీర్ నాయుడు వర్గం దాడి చేసి గాయపర్చిందని కాకర్ల భవానీ ఫిర్యాదు చేయగా ఫకీర్‌నాయుడు, మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

యూరియా స్వాధీనం



యూరియాను స్వాధీనం చేసుకున్న వ్యవసాయశాఖ అధికారులు

టి.నరసాపురం: అక్రమంగా యూరియా తరలిస్తున్న వ్యక్తిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి కె.హబీబ్ బాషా తెలిపారు. మండలంలోని బండివారిగూడెంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా యూరియా తరలిస్తున్నారనే సమాచారంతో వ్యవసాయ శాఖ సిబ్బందితో సోమవారం దాడులు నిర్వహించారన్నారు. ఈ దాడుల్లో 50 బస్తాలు స్వాధీనం చేసుకుని, రవాణా చేస్తున్న వ్యక్తిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

డీఎస్సీలో రోస్టర్ విధానం అమలు చేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డీఎస్సీ 2025 అమలు విషయంలో రోస్టర్ విధానాన్ని సరిగా అమలు చేయట్లేదని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్, దళిత మహాసభ సీనియర్ నాయకులు నేతల రమేష్ బాబు తదితరులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మను కలిసి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 7 చెప్పిన విధంగా పూర్తిస్థాయిలో 100శాతం రిజర్వేషన్‌ని అమలు చేయాలన్నారు.

అక్టోబరులో ఐఎఫ్‌టీయూ తరగతులు

ఏలూరు (టూటౌన్): ఐఎఫ్‌టీయూ రాష్ట్ర స్థాయి రాజకీయ తరగతులను అక్టోబర్ నెలలో నిర్వహించాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. ఈ నెల 24, 25 తేదీలలో ఏలూరులో ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నిర్ణయించినట్లు ప్రధాన కార్యదర్శి కె.పోలారి ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక చవితి, ఇతర పండుగల నేపథ్యంలో వాయిదా వేశామన్నారు.

పైసలిస్తేనే ఆపరేషన్లు

- తణుకు పీపీ యూనిట్‌లో నిర్వాకం
- కు.ని. ఆపరేషన్లకు రూ.500 నుంచి రూ.1000 ఇవ్వాల్సిందే

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేయించుకోవాలంటే చేయి తడపాల్సిందే.. వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించిన పీపీ యూనిట్ విభాగంలో నిర్వహిస్తున్న కుటుంబ నియంత్రణ (కు.ని.) శస్త్రచికిత్సల్లో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయ. కు.ని. ఆపరేషన్ చేయాలంటే రూ.500 ఇవ్వాలని, ఆపరేషన్ చేయడానికి కొంచెం సమయం ఎక్కువైతే మరొక రూ.500 ఇవ్వాలని వైద్యసిబ్బంది డిమాండ్ చేస్తున్నట్లు బాధితులు చెబుతున్నారు. గత జూన్‌లో బదిలీపై వచ్చిన వైద్యురాలు తమ వైద్య సిబ్బంది ద్వారా ఈ తరహాలో డబ్బులు వసూలు చేస్తున్నారని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శస్త్రచికిత్సలు పూర్తయిన తరువాత వైద్యసిబ్బంది వచ్చి డబ్బులు వసూలు చేసి వైద్యురాలికి ఇస్తున్నట్లుగా బాధితులు చెబుతున్నారు.

మందులు అక్కడే కొనాలి..

పీపీ యూనిట్ విభాగంలో కుని శస్త్రచికిత్సకు వచ్చిన వారు సదరు వైద్యురాలి ప్రైవేటు ప్రాక్టీస్‌గా ఉన్న ఆస్పత్రిలోని మందుల దుకాణంలోనే మందులు కొనుగోలు చేయాల్సివస్తుందని బాధితులు చెబుతున్నారు. జిల్లా కేంద్ర ఆస్పత్రికి ఎదురుగా కూతవేటు దూరంలో ఉన్న ఒక ప్రైవేటు ఆస్పత్రిలోని మందుల దుకాణం నుంచి మందులు తీసుకువచ్చిన తరువాత శస్త్రచికిత్స చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. శస్త్రచికిత్సలకు వచ్చిన వారికి వైద్యురాలు తన ప్రైవేటు ఆస్పత్రి పేరుమీద ఉన్న విజిటింగ్ కార్డును ఇచ్చి అక్కడ మాత్రమే మందులు కొనుగోలు చేయాలని చెబుతుండడం విశేషం. ఏదైనా తేడా వస్తే ఏదోక కొర్రీలు వేసి డిశ్చార్జ్‌ను జాప్యం చేస్తారని బాధితులు వాపోతున్నారు.

కు.ని. శస్త్రచికిత్సలకు సంబంధించి కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిర్లక్ష్య ధోరణి కనబరుస్తున్నారు. కూటమి ప్రభుత్వం జనాభా పెంచాలనే యోచనలో కుని శస్త్రచికిత్సలపై పట్టు వదిలేసిన దుస్థితి. గతంలో ప్రతి పీహెచ్‌సీలో కుని శస్త్రచికిత్సలు చేయాలంటూ వైద్యులకు టార్గెట్‌లు పెట్టి మరీ చేయించే పరిస్థితి ఉండేది. నేడు అలాంటి పరిస్థితి లేకపోవడంతో కొందరు వైద్యులు నిర్లక్ష్య ధోరణిని అవలంభిస్తూ ఇదే అదనుగా అవినీతి మార్గంలో అందినకాడికి దోచేసుకుంటున్నారని వైద్యసిబ్బంది సైతం చెబుతున్నారు. కొందరు వైద్యులు అవినీతికి పాల్పడుతున్నా, విధుల్లో అలసత్వం వహిస్తున్నా వైద్యారోగ్య శాఖ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఇలాంటి అవినీతి ఎన్నడూ లేదని వైద్యసేవలన్నీ పారదర్శకంగా జరిగేవని రోగులు చెబుతున్నారు.



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పీపీ యూనిట్ విభాగం



వైద్య సిబ్బందికి రూ.500 ఫోన్ పే



ప్రైవేటు ఆస్పత్రిలో మందుల కొనుగోలు బిల్లు

రూ.1000 ఇచ్చాను

నా భార్యకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించేందుకు ఆస్పత్రిలోని పీపీ యూనిట్ విభాగంలోని వైద్యురాలిని సంప్రదించగా సోమవారం శస్త్రచికిత్స చేస్తామని రమ్మన్నారు. వచ్చిన తరువాత వైద్యురాలు మందులు చీటీ రాసి ఆస్పత్రికి ఎదురుగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రిలోని మందుల దుకాణంలోనే మందులు కొనాలని చెప్పారు. వైద్యురాలి పేరుతోనే ఉన్న విజిటింగ్ కార్డు ఇచ్చారు. శస్త్రచికిత్స అనంతరం వైద్యసిబ్బంది వచ్చి రూ.500 ఇమ్మంటే ఇచ్చాను. ఆ తరువాత ఆపరేషన్ సమయంలో మత్తు రెండోసారి ఇవ్వాల్సి వచ్చిందని.. మరో రూ. 500 ఇమ్మంటే వైద్యసిబ్బంది నెంబరుకు ఫోన్‌పే ద్వారా చెల్లించాను.

– అంజిబాబు, వేలివెన్ను, ఉండ్రాజవరం మండలం

కూటమిలో డిష్యూం.. డిష్యూం



అజ్జమూరు దేవస్థాన కమిటీ ప్రమాణస్వీకారంలో బీజేపీ నాయకుడిపై జనసేన ఇన్‌చార్జి ఆగ్రహం

రసాభాసగా అజ్జమూరు దేవస్థాన కమిటీ ప్రమాణస్వీకారం

ఆకివీడు: మండలంలోని అజ్జమూరు జనార్దన స్వామి దేవస్థానం నూతన కమిటీ ప్రమాణస్వీకారం రసాభాసగా ముగిసింది. దేవస్థాన కమిటీ చైర్మన్ పదవిని జనసేనకు కేటాయించారు. చైర్మన్‌గా నాని, డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేస్తున్న సమయంలో బీజేపీ మండల అధ్యక్షురాలు ముదునూరి నాగమణి అభ్యంతరం చెప్పారు. తమకు తెలియకుండా బోర్డును ఎన్నుకోవడం సమంజసం కాదన్నారు. నియామకంలో తమకు ఎందుకు ప్రాతినిధ్యం కల్పించలేదని నిలదీశారు. మరో బీజేపీ నాయకుడు వర్దినేని లక్ష్మీ వర ప్రసాద్ మాట్లాడుతూ చైర్మన్ పదవిని రూ.3 లక్షలకు కొనుగోలు చేశారనే ఆరోపణలు గ్రామంలో వెల్లువెత్తుతున్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాణం చేయడానికి తాను సిద్ధమని అన్నారు. హిందూ దేవాలయాల్లో అన్య మతస్తుల్ని నియమించకూడదన్న నిబంధన ఎందుకు పాటించలేదని ప్రసాద్ నిలదీశారు. మతం తీసుకున్న వ్యక్తులు హిందూ దేవాలయ కమిటీల్లో ఉండకూడదని పట్టు బట్టారు. దీనిపై చర్యలు తీసుకోకపోతే దేవాలయ శాఖ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తానని హెచ్చరించారు. దీంతో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఒకదశలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు బీజేపీ నాయకుడు వర ప్రసాద్‌పై మండిపడ్డారు. ఇలాంటి వారిపై ఎందుకు చర్య తీసుకోరని బీజేపీ మండల అధ్యక్షురాల్ని ప్రశ్నించారు. తమకు తెలియకుండా బోర్డు వేయడం తప్పు కాదా! అని ఆమె ఎదురు ప్రశ్నవేశారు. ఇరు పార్టీల నాయకుల మధ్య వాగ్వాదం పెరగడంతో గ్రామ పెద్దలు కలుగజేసుకుని సర్దిచెప్పారు.

ఆక్వా ఎగుమతులపై ఆందోళన వద్దు

భీమవరం: ఆక్వా ఎగుమతులపై అమెరికా టారిఫ్‌ల కారణంగా రైతులకు ఎలాంటి నష్టం లేకుండా కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని కేంద్ర ఉక్కు శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. సోమవారం భీమవరంలోని క్యాంపు కార్యాలయంలో ఎంపీ బీద మస్తాన్‌రావు, ఆక్వా రైతులు కలిసి ఆక్వా సమస్యలపై చర్చించారు. భారత్‌నుంచి ఎగుమతులు నిలిచిపోవడంతో అమెరికా దిగుమతిదారులు ఆందోళన చెందారని, రైతులు నష్టపోకుండా పెంచిన టారిఫ్‌ను వారే భరిస్తామని తెలిపారని మంత్రి చెప్పారు. రొయ్య రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల సుబ్బరాజు, పి.వెంకటేశ్వర రాజు, సీహెచ్ రామభద్రరాజు పాల్గొన్నారు.

టీడీపీ నేతల అడ్డాగా ఫెర్రీ

- అనుమతులు లేకుండా అబ్బిరాజుపాలెం రేవులో పడవలపై రాకపోకలు
- మంత్రి అండతోనే నడుపుతున్నామంటున్న నాయకులు
- తెలిసినా పట్టించుకోని అధికారులు

యలమంచిలి: పశ్చిమ గోదావరి జిల్లా అబ్బిరాజుపాలెం, అంబేడ్కర్ కోనసీమ జిల్లా సోంపల్లి గ్రామాల మధ్య గోదావరిలో పడవ ప్రయాణానికి అనుమతి లేకపోయిన టీడీపీ నాయకులు దౌర్జన్యంగా పడవలు నడుపుతున్నారు. అనధికారికంగా పడవలు తిప్పుతూ కనీస వసతులు కల్పించడం లేదు. సోమవారం ఒక పడవపై పదుల సంఖ్యలో మోటార్ సైకిల్స్ వేసి పడవ నడిపారు. పడవలో ఉన్న వారికి కనీసం లైఫ్ జాకెట్స్ ఇవ్వలేదు. దీనిపై ఇద్దరు ప్రయాణికులు అడిగిన పాపానికి వారిపై టీడీపీ నాయకుడు విచక్షణా రహితంగా దాడి చేశాడు. లైఫ్ జాకెట్స్ ఉండవు.. చస్తామనే భయముంటే పడవ ఎక్కకండి అంటూ వారిపై విరుచుకుపడ్డాడు. దీంతో ఆ ఇద్దరి యువకులు రాజోలు పోలీస్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.



యలమంచిలి మండలం అబ్బిరాజుపాలెం గోదావరి రేవులో తిరుగుతున్న పడవలు

వరదకు ముందు నుంచే..

ఒకవైపు వరద.. మరో వైపు మరమ్మతుల పేరిట చించినాడ వంతెనపై రాకపోకలకు ఆంక్షలు. దీంతో కోనసీమ జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో పడవ ప్రయాణాన్ని ఆశ్రయిస్తున్నారు. మండల పరిషత్ అధీనంలో ఉన్న దొడ్డిపట్ల ఫెర్రీకి మాత్రమే వంటు నడపడానికి అనుమతి ఉంది. పంచాయతీ అధీనంలో ఉన్న అబ్బిరాజుపాలెం ఫెర్రీకి రెండు నెలల క్రితమే ఫెర్రీ పాట గడువు ముగిసింది. ఇదే అదునుగా తెలుగుదేశం నాయకులు మంత్రి ద్వారా అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి పాట పెట్టకుండా అనధికారికంగా ఈ ఫెర్రీలో పడవలు నడుపుతున్నారు. కనీస రక్షణ చర్యలు లేకుండా పడవలపై అధిక లోడు వేసి నడపడంపై ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా పట్టించుకోవడం లేదు.

మంత్రి నడుపుకోమన్నారు

ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జరిగిన గ్రామ సభలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులను గ్రామస్తులు ఫెర్రీ పాట పెట్టకుండా పడవలు ఎలా నడుపుతున్నారని ప్రశ్నించారు. రేవులో నడుపుతున్న పడవలకు పంచాయతీకి సంబంధం లేదని సర్పంచ్, గ్రామ కార్యదర్శి చెప్పగా, అక్కడే ఉన్న తెలుగుదేశం నాయకులు మంత్రి నిమ్మల రామానాయుడు నడపమని చెప్పడంతో మేమే నడుపుతున్నాం అని చెప్పారు. మంత్రి పేరు చెప్పడంతో మిగిలిన వారు మిన్నకుండిపోయారు. వరద సమయంలో కనీస రక్షణ చర్యలు లేకుండా, అనుమతి లేకుండా ఫెర్రీలో పడవలు నడుపుతున్నా పంచాయతీరాజ్, రెవెన్యూ, కన్సర్వెన్సీ అధికారులు పట్టించుకోకపోవడం వెనుక భారీగా ముడుపులు అందడమే కాకుండా మంత్రి ఒత్తిడి కూడా ఉందని గ్రామస్తులు గుసగుసలాడుతున్నారు.

శ్రీవారికి బంగారు యజ్ఞోపవీతం బహూకరణ



శ్రీవారి దేవస్థానం ఈఓ సత్యనారాయణ మూర్తికి బంగారు యజ్ఞోపవీతాన్ని అందజేస్తున్న దాతలు



బంగారు యజ్ఞోపవీతం

ద్వారకాతిరుమల: శ్రీవారికి దాతలు సుమారు రూ.11 లక్షల విలువైన 106 గ్రాముల బంగారు యజ్ఞోపవీతాన్ని సోమవారం బహూకరించారు. భీమవరానికి చెందిన పిన్నమరాజు శ్రీనివాసరాజు, విజయవర్మ, భూపతిరాజు, శివరామరాజులు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ బంగారు యజ్ఞోపవేతాన్ని ఆలయ కార్యాలయంలో దేవస్థానం ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తికి అందించారు. దీన్ని స్వామివారి సేవకు వినియోగించాలని దాతలు కోరారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా వేధింపులు

నత్తగుళ్లపాడు సర్పంచ్ ఆవేదన

కైకలూరు: గ్రామ ప్రథమ పౌరుడైన సర్పంచ్‌గా తనకు ఏ మాత్రం గౌరవం లేకుండా కూటమి సానుభూతిపరులతో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించడం రాజ్యాంగ విరుద్ధమని నత్తగుళ్లపాడు సర్పంచ్ ముంగర రామకృష్ణంరాజు ఆవేదన వ్యక్తం చేశారు. కై కలూరులో విలేకరుల సమావేశంలో సోమవారం మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పాలనలో జగనన్న లేఅవుట్‌లో 42 మంది పేదలకు నత్తగుళ్లపాడులో స్థలాలకు 3 ఎకరాలు రూ.40 లక్షలతో పూడిక చేశానన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంటి స్థలాలను పంపిణీ చేయడం లేదన్నారు. దీని సమీపంలో 37, 38 39, 40 సర్వే నెంబర్లలో కొల్లేరు అభయార్యణంలో అక్రమ చేపల సాగు చేస్తోన్నారన్నారు. అన్ని అనుమతులతో పూడ్చిన భూమిని పంపిణీ చేయని అధికారులు అక్రమ సాగుపై మాత్రం చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అక్రమ సాగు సమస్యలపై అర్జీ ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. కూటమి పార్టీకి చెందిన బలే ఏసురాజు తనపై కక్ష కట్టారని.. తన వాహనాల టైర్లను అతని సానుభూతిపరులు ధ్వంసం చేశారన్నారు. కొల్లేరులో ఏసు బుక్ రాజ్యాంగం నడుస్తోందని విమర్శించారు.



సర్పంచ్ రామకృష్ణంరాజు

వసతి గృహంలో టైఫాయిడ్ జ్వరాలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం గిరిజన సంక్షేమ శాఖ కళాశాల వసతి గృహంలో విద్యార్థినులు టైఫాయిడ్‌కు గురయ్యారు. ఇంటర్ చదువుతున్న 13 మంది టైఫాయిడ్‌కు గురికావడంతో స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతున్న విద్యార్థినులు ఆగస్టు 15 సెలవులకు వెళ్లి 21న గురువారం హాస్టల్‌కు వచ్చినట్లు చెబుతున్నారు. శనివారం రాత్రి అస్వస్థతకు గురికాగా, వసతిగృహంలో మందులు అందజేశారు. జ్వరం తగ్గకపోవడంతో ఆదివారం ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చి రక్తపరీక్షలు నిర్వహించగా, టైఫాయిడ్‌గా నిర్ధారణ అయ్యింది. దీంతో వైద్యులు విద్యార్థినులకు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. విద్యార్థినులను డీఎంఅండ్‌హెచ్‌వో, డీఎంవో కార్యాలయాల నుంచి అధికారులు వచ్చి పరామర్శించారు. మరోవైపు బాలికల వసతి గృహం వద్ద మంచినీటి శాంపిల్స్ సేకరించారు. పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపనున్నట్లు అధికారులు తెలిపారు.



జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

లోన్ల పేరుతో భారీ మోసం

రూ.2.50 కోట్లు కాజేసిన నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కేపీ శివకిషోర్

ఏలూరు టౌన్: లోన్ల పేరుతో సొమ్ములు కాజేసిన నిందితులను, ట్రాక్టర్ చోరీ కేసులో నిందితులను ఏలూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పవర్‌పేటలోని ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌లో కొందరు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి వాటితో బ్యాంకులో రుణాలు తీసుకున్నారు. రూ.2.50 కోట్లను నకిలీ పత్రాలతో కాజేసినట్లు ఫైనాన్స్ సంస్థ మేనేజర్ తుమ్మ శ్రీనివాసరెడ్డి ఫిర్యాదుతో పోలీసులు రంగ ప్రవేశం చేసి నిందితులను అరెస్ట్ చేశారు. వరపుల ఫణీంద్రకుమార్, ప్రసాదం జయకృష్ణ, మూసీ సీతారామయ్యలు రుణాల కోసం బ్యాంకుకు వచ్చే కస్టమర్ల నుంచి ఆధార్ కార్డులు, పాన్ కార్డులు తీసుకున్నారు. ఈ ఆధార్, పాన్ కార్డులతో వేరే వ్యక్తుల ఇళ్ళవద్ద ఫొటోలు తీయించి, అదే ఇంటిని ప్రాపర్టీగా చూపిస్తూ నకిలీ పత్రాలు సృష్టించారు. ఈ నకిలీ పత్రాలతో సొమ్ములు కాజేసినట్లు విచారణలో వెల్లడైంది. ఏలూరు మండలం మాదేపల్లి, లింగారావుగూడెం గ్రామంలో ఇంటిముందు రోడ్డుపై పార్క్ చేసిన ట్రాక్టర్‌ను ఈ నెల 19న గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ట్రాక్టర్ యజమాని నున్న కిషోర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. సోమవారం మినీబైపాస్‌లో పీ.వెంకటేశ్వరరావు వెంచర్‌లోని ఖాళీ స్థలంలో పొదల్లో ట్రాక్టర్‌ను ఉంచారు. పల్నాడు జిల్లాకు చెందిన యన్నం హరినాథ్, రవీంద్రనాథ్‌రెడ్డిలు ట్రాక్టర్ చోరీ చేసినట్లు విచారణలో తేలింది.

యోగా పోటీలకు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. ప్రత్తిపాడు సరస్వతీ విద్యాలయంలో జరిగిన పోటీలలో విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో మొత్తం ఐదు విభాగాలలో ప్రతిభ కనబర్చి మెడల్స్ సాధించారు. జూనియర్స్ విభాగంలో పీయూసీ ద్వితీయ సంవత్సర విద్యార్థిని కే హరిత బ్యాక్ బెండ్ ఈవెంట్‌లో గోల్డ్ మెడల్, ట్విస్టింగ్ ఈవెంట్‌లో సిల్వర్ మెడల్ సాధించడం విశేషం. సీనియర్స్ విభాగంలో ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సర విద్యార్థి దీపక్ నాయుడు ట్విస్టింగ్ ఈవెంట్లో సిల్వర్ మెడల్, ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సర విద్యార్థి అభిషేక్ ట్రెడిషనల్ ఈవెంట్‌లో సిల్వర్ మెడల్ సాధించగా, అశోక్ ఆర్టిస్టిక్ సోలో ఈవెంట్లో బ్రాంజ్ మెడల్ సాధించారు.

పథకాలను అందిపుచ్చుకోవడంలో వెనుకంజ



దళిత,గిరిజన బడ్జెట్ వాచ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కన్వీనర్ దేవకుమార్

ఏలూరు (టూటౌన్): ఎస్సీ, ఎస్టీలు ప్రభుత్వ పథకాలను అందుకోవడంలో వెనుకబడి ఉన్నారని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రాష్ట్ర కన్వీనర్ అల్లాడి దేవ కుమార్ అన్నారు. జిల్లా దళిత గిరిజన బడ్జెట్ వాచ్ కమిటీ సమావేశం లేడీస్ క్లబ్‌లో సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా రేవుల గడ్డ మణిసింగ్ వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీలపై అత్యాచార నిరోధక చట్టం, ఉపప్రణాళిక అమలు, సమస్యలపై సమావేశం జరిగింది. దేవకుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ఉన్నప్పటికీ వాటిని అందిపుచ్చుకోవడంలో జాప్యం జరుగుతుందన్నారు. డీబీఆర్‌సీ జిల్లా కన్వీనర్ సింగవరపు జ్యోతి, స్టేట్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ హేమలత, మేతర అజయ్ బాబు, పెరికే ప్రసాదు, అబ్రహం మాస్టర్, వాసే జైపాల్ పాల్గొన్నారు.

కేక్‌లో బల్లిపై ఆందోళన

ముదినేపల్లి రూరల్: ఫుడ్‌సేఫ్టీ అధికారుల ఆదేశాలు, సూచనలు బేఖాతరు చేస్తూ ఆహారపదార్థాల తయారీలో అశ్రద్ధ వహిస్తున్నారు. స్థానిక బేకరీలో తయారు చేసిన కేక్‌లో బల్లి రావడమే ఇందుకు నిదర్శనం. స్థానికుడు బేకరీలో కేక్‌ను కొనుగోలు చేయగా అందులో బల్లి అవశేషాలున్నట్లు గుర్తించి నిర్వాహకుడిని నిలదీశారు. దీనిపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల ఉదాసీనత వైఖరి వల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని ఇకముందు జరగకుండా వ్యాపారసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.